సాక్షి
మెదక్

గురువారం | 5 | అక్టోబర్ | 2023



తండాల అభివృద్ధికి పెద్దపీట

గిరిజన తండాల అభివృద్ధి సీఎం కేసీఆర్‌తోనే సాధ్యమయ్యాయని గిరిజనాభివృద్ధి, స్త్రీ, శిశు సంక్షేమశాఖ మంత్రి సత్యవతి రాథోడ్ అన్నారు.

వివరాలు 8లో ▸

లాకర్ అందజేత

మల్లికార్జున స్వామి ఆలయానికి హైదరాబాద్‌కు చెందిన మాజీ ధర్మకర్త ఎర్రగొల్ల మల్లేశ్ లాకర్ బహూకరించారు.

వివరాలు 8లో ▸



మెదక్‌కు నేడు హరీశ్‌రావు

మెదక్ మున్సిపాలిటీ: ఆర్థికశాఖ మంత్రి హరీశ్‌రావు, ఎమ్మెల్యే పద్మాదేవేందర్‌రెడ్డి మెదక్‌లో పర్యటించనున్నట్లు మున్సిపల్ చైర్మన్ చంద్రపాల్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. పట్టణంలో పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేయనున్నట్లు తెలిపారు.

న్యూస్‌రీల్

రేపటి నుంచి అల్పాహారం



ఏర్పాట్లను పరిశీలిస్తున్న డీఈఓ, ఎంపీపీ

శివ్వంపేట(నర్సాపూర్): జిల్లాలోని రెండు ప్రభుత్వ పాఠశాలల్లో ఈ నెల 6 నుంచి అల్పాహార పథకం అమలు చేస్తున్నట్లు జిల్లా విద్యాధికారి రాధాకిషన్ తెలిపారు. బుధవారం మండల పరిధి చిన్నగొట్టిముక్ల ఉన్నత పాఠశాలలో ఇందుకు సంబంధించిన ఏర్పాట్లను ఎంపీపీ కల్లూరి హరికృష్ణతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా డీఈఓ మాట్లాడుతూ.. అల్పాహార పథకం ట్రయల్‌రన్‌లో భాగంగా మెదక్ బాలికల, చిన్నగొట్టిముక్లలోని ఉన్నత పాఠశాలలను ఎంపిక చేసినట్లు చెప్పారు. స్థానిక ఎమ్మెల్యేలు పథకాన్ని ప్రారంభిస్తారని చెప్పారు. దసరా సెలవుల అనంతరం అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో అల్పాహారం అందివ్వనున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో ఎంఈఓ బుచ్చనాయక్, సర్పంచ్ బాలమణి ఉన్నారు.

భిక్షాటనతో నిరసన



భిక్షాటన చేస్తున్న ఆశావర్కర్లు

పెద్దశంకరంపేట(మెదక్): ప్రభుత్వం తమ సమస్యలు వెంటనే పరిష్కరించాలని కోరుతూ బుధవారం పేటలో ఆశా వర్కర్లు భిక్షాటన చేసి నిరసన తెలిపారు. వేతనాలు పెంచి ఉద్యోగ భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో పద్మ, సౌందర్య, యశోద, అరుణ, సుశీల, గంగమణి పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి పోటీలకు..



రాష్ట్రస్థాయి జట్టుకు ఎంపికైన విద్యార్థులు

నర్సాపూర్ రూరల్: రాష్ట్రస్థాయి స్కూల్ ఫెడరేషన్ గేమ్స్ అండర్ 14 వాలీబాల్ జట్టుకు మండలంలోని జక్కపల్లి మోడల్ స్కూల్‌కు చెందిన నలుగురు విద్యార్థులు దుర్గాప్రసాద్, కార్తీక్, సమీర్, హామన్ ఎంపికయ్యారు. ఇటీవల జరిగిన జిల్లాస్థాయి స్కూల్ ఫెడరేషన్ గేమ్స్‌లో ప్రతిభ కనబరచడంతో రాష్ట్ర స్థాయికి ఎంపికయ్యారు. విద్యార్థులను ప్రిన్సిపాల్ విజయలక్ష్మి, పీడీ అశోక్ అభినందించారు.

సమ్మెలో 104 ఉద్యోగులు



సమ్మెలో పాల్గొన్న 104 ఉద్యోగులు

మెదక్ కలెక్టరేట్: తమ న్యాయమైన డిమాండ్లు పరిష్కరించాలంటూ 104 ఉద్యోగులు బుధవారం మెదక్ కలెక్టరేట్ వద్ద నిరవధిక సమ్మె చేపట్టారు. వీరికి సంఘీభావం తెలిపిన సీఐటీయూ జిల్లా కార్యదర్శి బస్వరాజ్ మాట్లాడుతూ 104 ఉద్యోగులకు పనికి తగిన వేతనం ఇవ్వాలని డిమాండ్ చేశారు. అర్హత ఉన్నవారిని రెగ్యులరైజ్ చేయాలన్నారు. అలాగే సెకండ్ ఏఎన్‌ఎంలుగా గుర్తించాలన్నారు. ఇచ్చిన ఆప్షన్ ప్రకారం సొంత జిల్లాలోనే ఉద్యోగ అవకాశం కల్పించాలన్నారు. హెల్త్‌కార్డు, ఆరోగ్య బీమా సౌకర్యాలు కల్పించాలన్నారు. డేటా ఎంట్రీ ఆపరేటర్లను కంప్యూటర్ ఆపరేటర్లుగా గుర్తించాలన్నారు. కార్యక్రమంలో రాజు, భూపతి, అవినాష్, రమేష్, రవి, సంజయ్, నూరుద్దీన్, మధు పాల్గొన్నారు.

మత్స్యకారులకు ప్రోత్సాహం



చేప పిల్లలను వదులుతున్న అధికారి

మనోహరాబాద్(తూప్రాన్): చేపల పెంపకాన్ని ప్రభుత్వం ప్రోత్సహిస్తుందని, దీని ద్వారా చాలామంది ఉపాధి పొందుతున్నారని జిల్లా మత్స్యశాఖ అధికారి రజని పేర్కొన్నారు. ఏడీ మనోహరాబాద్ మండలం కూచారం గ్రామ చెరువులో బుధవారం ఆమె చేప పిల్లలను వదిలారు. కార్యక్రమంలో పురం మహేష్, ఎంపీడీఓ యాదగిరిరెడ్డి, మండల ముదిరాజ్ అధ్యక్షుడు దాసరి నరేష్, కార్యదర్శి వేణుగోపాల్‌రెడ్డి తదితరులున్నారు.

స్వచ్ఛతతో ఆరోగ్యం

- యాంటీ లార్వా స్ప్రే ద్వారా దోమల నివారణ
- నెలకు మూడుసార్లు కార్యక్రమం
- ప్రతి ఆదివారం స్పెషల్ డ్రైవ్
- మురుగు కాల్వల్లో చెత్త వేయకూడదు
- మున్సిపల్ కమిషనర్ జానకీరాం సాగర్



ప్రజల సమస్యలు తెలుసుకుంటున్న కమిషనర్ జానకీరాం సాగర్

దోమల బెడద తొలగించడానికి యాంటీ లార్వా స్ప్రే చేయిస్తాం. ప్రతీ వీధిలో నెలకు మూడుసార్లు ఈ కార్యక్రమం నిర్వహిస్తాం. అదేరోజు సాయంత్రం ఫాగింగ్ చేయిస్తాం. ప్రతీ ఆదివారం పట్టణంలోని అన్ని వార్డుల్లో స్పెషల్ డ్రైవ్ నిర్వహించి గుంతలు, పాడైపోయిన టైర్లలో నిలిచిన నీటిని తొలగిస్తాం. మురికి కాలువల్లో చెత్త వేయవద్దు. ఇంటి పరిసరాలు శుభ్రంగా ఉంటే ఆరోగ్యంగా ఉంటాం. – జానకీరాం సాగర్, మున్సిపల్ కమిషనర్

సాక్షి ఫోన్ ఇన్

మెదక్ మున్సిపాలిటీ: మెదక్ మున్సిపల్ కార్యాలయంలో బుధవారం 'సాక్షి' ఆధ్వర్యంలో నిర్వహించిన ఫోన్ ఇన్ కార్యక్రమానికి అనూహ్య స్పందన లభించింది. ఉదయం 10 నుంచి 11గంటల వరకు కమిషనర్ జానకీరాం సాగర్‌కు ప్రజలు ఫోన్ చేసి తమ సమస్యలు వివరించారు. ప్రధానంగా దోమల నివారణ, కోతులు, కుక్కల బెడద, పిచ్చి మొక్కలు, డ్రైయినేజీ సమస్యలను కమిషనర్ దృష్టికి తీసుకువచ్చారు.

పారిశుద్ధ్య పనులు సక్రమంగా చేపట్టక దోమలు విజృంభిస్తున్నాయి.

–గణేష్, పిట్లంబేస్

కమిషనర్: వీధుల్లో పారిశుద్ధ్య పనులు సక్రమంగా చేపట్టేలా చర్యలు తీసుకుంటాం.

దోమల బెడద తీవ్రంగా ఉంది. ప్రజలు డెంగీ, మలేరియా బారిన పడుతున్నారు.

–మహిపాల్, పిట్లంబేస్

కమిషనర్: ఇప్పటికే వీధిలో యాంటీ లార్వా స్ప్రేతో పాటు ఫాగింగ్ చేయించాం. మళ్లీ చేయిస్తాం.

రోడ్లపై చెత్త కుప్పలు పేరుకుపోయాయి. వాటిపై కోతులు గుమిగూడి ప్రజలను ఇబ్బందికి గురిచేస్తున్నాయి. పలుమార్లు ఫిర్యాదు చేసినా చర్యలు చేపట్టడం లేదు.

–ఆవారి భరత్ ఫత్తేనగర్

కమిషనర్: పారిశుద్ధ్య పనులు చేయిస్తాం. త్వరలో కోతుల సమస్యను పరిష్కరిస్తాం.

చమన్‌రోడ్డు విస్తరణలో భాగంగా ఇళ్లను కూల్చివేశారు. రోడ్డు వేయడం లేదు.. మురికి కాల్వలు కట్టడం లేదు. దీంతో పందుల కారణంగా దోమలు వస్తున్నాయి.

–రాకేష్, చమన్‌వీధి

కమిషనర్: రోడ్డు విస్తరణ పనులు చేపట్టేందుకు కాంట్రాక్టర్లు రావడం లేదు. టెండర్లు పిలుస్తున్నాం. పందులు, కోతుల సమస్యను పరిష్కరిస్తాం. పారిశుద్ధ్య పనులు చేపట్టేందుకు చర్యలు తీసుకుంటాం.

ఫతేనగర్ వీధి సినీమ్యాక్స్ టాకీస్ వెనక పారిశుద్ధ్య పనులు సక్రమంగా చేపట్టడం లేదు. దోమలు ఎక్కువగా వస్తున్నాయి.

–మన్సూర్ హైమద్,

కమిషనర్: సిబ్బందిని పంపిస్తాం. సమస్య ఎక్కడ ఉందో చూపండి. పరిష్కరిస్తారు.

మురికి కాల్వలు సక్రమంగా శుభ్రం చేయడం లేదు. పందులు, ఈగలు, దోమలు పెరిగి జనం వ్యాధులు బారినపడుతున్నారు. స్వీపింగ్ మిషన్‌తో రోడ్డు సక్రమంగా శుభ్రం చేయడం లేదు. మధ్యలో మాత్రమే శుభ్రం చేస్తున్నారు. ఇరువైపుల చెత్త అలాగే ఉంటుంది.

–చందు, అజంపురా

కమిషనర్: ఇప్పటికే అజంపురా వీధిలో పారిశుద్ధ్య చర్యలు చేపట్టడంతోపాటు ఫాగింగ్ చేయడం జరిగింది. మరోసారి చర్యలు చేపడుతాం. వీధులు సక్రమంగా శుభ్రం చేయాలని సిబ్బందికి సూచిస్తాం.

మురికి కాల్వల్లో తీసిన చెత్త కుప్పలు తొలగించడం లేదు. –లక్ష్మణ్, గోల్కొండ వీధి

కమిషనర్: సిబ్బందిని పంపిస్తాం. సమస్య పరిష్కరించేలా చర్యలు చేపడుతాం.

అంబేద్కర్ కాలనీలోని కమ్యూనిటీ హాల్ వద్ద పిచ్చి మొక్కలు విపరీతంగా పెరిగాయి. కుక్కలు, కోతులు, పందులు బెడద తీవ్రంగా ఉంది.

–అక్కమొల్ల కుమార్, అంబేద్కర్ కాలనీ, గోల్కొండవీధి

కమిషనర్: కుక్కలు, కోతులు, పందుల నివారణకు చర్యలు చేపడుతాం.

రోడ్లపై ఎక్కడ పడితే అక్కడ చెత్త వేసి కాల్చుతున్నారు. వారిపై ఎందుకు చర్యలు చేపట్టడం లేదు. కోతులు, కుక్కలు కారణంగా తీవ్ర ఇబ్బంది అవుతుంది. –బాల్‌రాజ్, గోల్కొండవీధి.

కమిషనర్: ఎక్కడపడితే అక్కడ చెత్తను కాల్చవద్దని సిబ్బందికి సూచిస్తాం. కోతులు, కుక్కల నివారణకు త్వరలోనే కార్యక్రమం చేపడుతాం.

నవాబుపేట వీధికి వెళ్లేదారిలో ఒక ఇంటి వారు మురికి నీరంతా రోడ్డుపైకి వదులుతున్నారు. దీంతో నడవలేని పరిస్థితి నెలకొంది.

–చదల్ ప్రవీణ్ కుమార్, 13వ వార్డు గోల్కొండవీధి

కమిషనర్: సిబ్బందిని పంపించి తక్షణ చర్యలు చేపడుతాం.

4,34,275

జిల్లాలో ఓటర్లు

- మెదక్ నియోజకవర్గంలో 2,14,064
- నర్సాపూర్ నియోజకవర్గంలో 2,20,211
- ఓటరు తుది జాబితా విడుదల చేసిన కలెక్టర్

మెదక్ కలెక్టరేట్: జిల్లా ఓటరు తుది జాబితాను కలెక్టర్ రాజర్షిషా బుధవారం విడుదల చేశారు. మొత్తం 434275 మంది ఓటర్లు ఉండగా మెదక్ నియోజకవర్గంలో 214064 మంది, నర్సాపూర్ నియోజకవర్గంలో 220211 మంది ఉన్నారు. జిల్లా వ్యాప్తంగా 209927 పురుష ఓటర్లు, 224337 మంది మహిళా ఓటర్లు 11మంది థర్డ్ జెండర్లు ఉన్నారు. అలాగే 34వ అసెంబ్లీ నియోజకవర్గంగా మెదక్‌ను ఎంపిక చేయగా, 274 పోలింగ్ కేంద్రాలు ఉన్నాయి. నియోజకవర్గంలో పురుషులు 102340, మహిళలు 111720, థర్డ్ జెండర్ నలుగురు ఓటర్లు ఉన్నారు. ఎన్‌ఆర్‌ఐలు ఎనిమిది మంది ఉండగా అందులో పురుష ఓటర్లు ఏడుగురు, మహిళా ఓటర్లు ఒకరు ఉన్నారు. సర్వీస్ ఓటర్లు 85మంది ఉండగా



సభ్యులు 84మంది స్పౌజ్ 1 ఉన్నారు. 37వ అసెంబ్లీ నియోజకవర్గంగా నర్సాపూర్‌ను ఎంపిక చేయగా 305 పోలింగ్ కేంద్రాలు ఉన్నాయి. నియోజకవర్గంలో 220211 మంది ఓటర్లు ఉండగా, 107587మంది పురుష ఓటర్లు, 112617మంది మహిళా ఓటర్లు, ఏడుగురు థర్డ్ జెండర్స్ ఉన్నారు. అలాగే ఎన్‌ఆర్‌ఐలు పురుష ఓటరు ఒకరు ఉన్నారు. సర్వీస్ సభ్యులు 37మంది స్పౌజ్ ఇద్దరు ఉన్నారు.

మోదీ కృషితోనే పల్లె దవాఖానాలు



పల్లె దవాఖానాను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే రఘునందన్‌రావు

చేగుంట(తూప్రాన్): ప్రధాని నరేంద్రమోదీ కృషితోనే పల్లె దవాఖానాల ఏర్పాటవుతున్నాయని దుబ్బాక ఎమ్మెల్యే రఘునందన్‌రావు అన్నారు. మండలంలోని గొల్లపల్లిలో రూ.20 లక్షల నిధులతో నిర్మించిన పల్లె దవాఖానాను ఎమ్మెల్యే ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఐదు వేల జనాభాకు ఒక ఆస్పత్రి ఉంటే మెరుగైన వైద్య సేవలు అందుతాయని మోదీ పల్లె దవాఖానాలను ఏర్పాటు చేయిస్తున్నారని తెలిపారు. మహిళలు అన్ని రంగాల్లో అభివృద్ధి చెందాలని కేంద్ర ప్రభుత్వం 33 శాతం బిల్లును ప్రవేశ పెట్టిందని తెలిపారు. గ్రామాల అభివృద్ధికి నాయకులు జెండాలను పక్కనపెట్టి పని చేయాలన్నారు. ఈ సందర్భంగా గ్రామంలో నీటి సమస్య పరిష్కరించాలని మహిళలు ఎమ్మెల్యేకు విన్నవించారు. సొంత ఖర్చుతో బోరు బావిని తవ్విస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో సర్పంచ్ ఎల్లారెడ్డి, వైస్ ఎంపీపీ రాంచంద్రం, ఎంపీటీసీ గణేష్, బీజేపీ మండల శాఖ అధ్యక్షుడు భూపాల్, గోవింద్, గణేష్, సంతోష్‌రెడ్డి, మాజీ సర్పంచులు ప్రతాప్‌రెడ్డి, రఘువీర్ పాల్గొన్నారు.

బోరు తవ్వితే అనుమతి తప్పనిసరి

భూగర్భ జలశాఖ జిల్లా అధికారి వెంకటేశ్వర్‌రావు

మెదక్ కలెక్టరేట్: వాల్టా–2002 చట్టానికి వ్యతిరేకంగా ఇష్టానుసారంగా బోర్లు తవ్వితే జరిమానా విధిస్తామని భూగర్భ జలశాఖ జిల్లా అధికారి వెంకటేశ్వర్‌రావు హెచ్చరించారు. బుధవారం కలెక్టరేట్‌లో వాల్టాచట్టం ప్రగతి నివేదికపై కలెక్టర్ ఆధ్వర్యంలో చర్చించారు. ఈ కార్యక్రమానికి అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్‌రావు, డీఎస్పీ, ఆర్డీఓ, భూగర్భ జలశాఖ ఉప సంచాలకులు హాజరయ్యారు. ఈ సందర్భంగా వెంకటేశ్వర్‌రావు మాట్లాడుతూ జిల్లాలో ఇష్టానుసారంగా బోర్లు తవ్వితే భూగర్భ జలాలు అడుగంటి పోయే ప్రమాదం ఉందన్నారు. కొన్ని గ్రామాల్లో నీరు రాని బోరు గుంతలను పూడ్చకుండా అలాగే వదిలేస్తున్నట్లు తెలిపారు. బోరుబావులు వేసే వాహన యజమానులు తప్పనిసరిగా భూగర్భ జల కార్యాలయంలో రెండేళ్లకు ఒకసారి రిజిస్ట్రేషన్ చేసుకోవాలని తెలిపారు. బోరు వేయాలనుకునే వారు తప్పనిసరిగా తహసీల్దార్, భూగర్భ జల శాఖ నుంచి అనుమతి తీసుకోవాలన్నారు. లేని పక్షంలో వాల్టా చట్టం రూల్–26 ప్రకారం లక్ష రూపాయల జరిమాన విధించడం జరుగుతుందన్నారు.

పాలకులం కాదు.. ప్రజా సేవకులం

మల్కాజ్‌గిరి ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంతరావు



ఏడుపాయలలో పూర్ణకుంభంతో స్వాగతం పలుకుతున్న అర్చకులు

పాపన్నపేట/ మెదక్/ కౌడిపల్లి(నర్సాపూర్): పాలకుల్లా కాకుండా ప్రజా సేవకులుగా పని చేస్తామని మల్కాజ్‌గిరి ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంతరావు ఆయన తనయుడు రోహిత్‌లు అన్నారు. బుధవారం ఏడుపాయల దుర్గాభవాని అమ్మవారిని వారు దర్శించుకున్నారు. అనంతరం మాట్లాడుతూ.. డాక్టర్ అయిన తన కుమారుడు ప్రజాసేవపై ఇష్టంతో రాజకీయాల్లోకి వచ్చాడని, మెదక్ నియోజకవర్గ ప్రజలు ఆదరించాలని కోరారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వానికి మాటలతోకాదు చేతలతో బుద్ధి చెబుతామన్నారు. దళితబంధు, బీసీ బంధు బీఆర్‌ఎస్ కార్యకర్తలకు ఇస్తూ ప్రజల మధ్య చిచ్చు పెడుతున్నారని ఆరోపించారు. కేసీఆర్ రాష్ట్రాన్ని అప్పుల ఊబిలోకి నెట్టాడని అన్నారు. హైదరాబాద్‌లో విలువైన భూములు అమ్ముతూ పబ్బం గడుపుతున్నారని చెప్పారు. కాంగ్రెస్ అధికారంలోని రాగానే జిల్లా ప్రజల అభీష్టం మేరకు సిరిసిల్లా జోన్‌నుంచి చార్మినార్ జోన్‌లో కలిపి న్యాయం చేస్తామని మైనంపల్లి తెలిపారు.

ఘనస్వాగతం

నర్సాపూర్ మీదుగా మంబోజిపల్లి నుంచి ఏడుపాయల వెళ్లుండగా మైనంపల్లి హన్మంతరావు, ఆయన కుమారుడు రోహిత్‌లకు కాంగ్రెస్ కార్యకర్తలు ఘనస్వాగతం పలికారు. మంబోజిపల్లి చౌరస్తా, కౌడిపల్లి వద్ద వారిని కలవడానికి కార్యకర్తలు, నాయకులు భారీగా తరలివచ్చారు. గజమాలతో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో టీపీసీసీ ప్రధానకార్యదర్శి ఆవుల రాజిరెడ్డి, మండల కాంగ్రెస్‌పార్టీ అధ్యక్షుడు శ్రీనివాసరావ్, యూత్ అధ్యక్షుడు ధన్‌సింగ్, ప్రశాంత్‌రెడ్డి, ఎఫ్ఎసీఎస్ చైర్మన్ రమేశ్, జీవన్‌రెడ్డి, చౌదరి సుప్రభాత్‌రావు, జీవన్‌రావు, బొజ్జ పవన్, వెంకటరమణ, కూచన్‌పల్లి మహేందర్‌రెడ్డి, మేడి గణేష్ పాల్గొన్నారు.

పీఏసీఎస్‌ను ఏ గ్రేడ్ లో నిలపడమే లక్ష్యం

డీసీఎంఎస్ వైస్ చైర్మన్ రమేశ్ కుమార్



మాట్లాడుతున్న డీసీఎంఎస్ వైస్ చైర్మన్ రమేశ్ కుమార్

కొల్చారం(నర్సాపూర్): వచ్చే ఏడాది వరకు రంగంపేట ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాన్ని బీ గ్రేడ్ నుంచి ఏ గ్రేడ్‌లో నిలపడమే ప్రధాన లక్ష్యమని, డీసీఎంఎస్ వైస్ చైర్మన్, సంఘం చైర్మన్ అరిగె రమేష్ కుమార్ పేర్కొన్నారు. బుధవారం కార్యాలయ ఆవరణలో రమేశ్ అధ్యక్షతన మహాసభను నిర్వహించారు. సంఘం పరిధిలోని ఆరు గ్రామాలకు చెందిన సభ్యులతో పాటు రైతులు హాజరయ్యారు. సంఘం సీఈఓ నవీన్ ప్రాథమిక నివేదికను చదివి వినిపించారు. 2023–24 యాసంగిలో 1334 మంది రైతుల నుంచి 78732.4 క్వింటాళ్ల ధాన్యాన్ని కొనుగోలు చేసినట్లు తెలిపారు. ఇందుకు సంబంధించి రైతులకు రూ.16,21,88,744 చెల్లించినట్లు చెప్పారు. పంట రుణాలు, ఎల్టీ లోన్ కింద మొత్తం 391 మందికి రూ.5,13,18,350 ఇచ్చినట్లు తెలిపారు. ఏడాదిలో ఫర్టిలైజర్ అమ్మకాల ద్వారా సంఘానికి రూ.2,21,226 లాభం వచ్చిందన్నారు. అనంతరం రమేశ్ కుమార్ మాట్లాడుతూ.. ధాన్యం కొనుగోళ్లలో రైతులకు ఇబ్బంది కలగకుండా చూడటమే తన ప్రధాన కర్తవ్యం అన్నారు. గతంలో ధాన్యం రవాణా,అధిక తూకం, గన్ని బ్యాగుల కొరత తలెత్తకుండా ఇప్పటికే అధికారులతో చర్చించి ఆ దిశగా ముందుకు సాగుతున్నామన్నారు. ఈ మహాసభలో సంఘం వైస్ చైర్మన్ మల్లేశం, ఎంపీపీ ఉపాధ్యక్షుడు మల్లారెడ్డి, రమేష్, దుర్గేష్, లింగన్న గారి ప్రవీణ్ రెడ్డి, జనార్దన్ గౌడ్, సాయిలు, శివయ్య, రమేష్, సంగమేశ్వర్ రెడ్డి, విష్ణువర్ధన్‌రెడ్డి, మాధవి రాజాగౌడ్, భూపాల్‌రెడ్డి, దుర్గేష్, సుధాకర్ పాల్గొన్నారు.



తూప్రాన్ పెద్ద చెరువుకు చేరుకున్న బోట్లు

చెరువులో బోట్ షికార్!

తూప్రాన్: ఎన్నో ఏళ్లుగా ఎదురు చూస్తున్న పట్టణ వాసుల కల సాకారం కానుంది. నదులు, సముద్రాల తరహాలో పట్టణ సమీపంలోని పెద్ద చెరువులో బోట్ షికారు చేయనున్నారు. బుధవారం చెరువు వద్దకు రెండు బోట్లు వచ్చి చేరాయి. వాటిని చెరువులో ట్రయల్ రన్ చేశారు. గురువారం మున్సిపల్ పాలకవర్గం సభ్యులతో పాటు బీఆర్‌ఎస్ నాయకులు బోటింగ్‌ను ప్రారంభించనున్నారు. బోట్లు ఏర్పాటు చేసినందుకు మంత్రి హరీశ్‌రావుకు మున్సిపల్ చైర్మన్ రవీందర్‌గౌడ్, వైస్ చైర్మన్ శ్రీనివాస్ కృతజ్ఞతలు తెలిపారు.

సూక్ష్మ గోల్డ్ వరల్డ్‌కప్



బంగారంతో తయారు చేసిన సూక్ష్మ వరల్డ్‌కప్, (ఇన్‌సెట్) శ్రీనివాస్‌చారి

పెద్దశంకరంపేట(మెదక్): నేటి నుంచి ప్రారంభం కానున్న వన్డే వరల్డ్‌కప్‌ను ఇండియా గెలవాలని ఆకాంక్షిస్తూ పెద్దశంకరంపేటకు చెందిన అవుసుల శ్రీనివాస్‌చారి బంగారంతో సూక్ష్మ వరల్డ్ కప్ నమూనాను తయారు చేశాడు. గతంలో కూడా ఆయన పలు సూక్ష్మ కళాఖండాలను తయారు చేశాడు.

వృత్తి నైపుణ్య శిక్షణ

మెదక్ కలెక్టరేట్: నిరుద్యోగులకు స్వయం ఉపాధి కోర్సులలో శిక్షణ ఇవ్వనున్నట్లు జిల్లా యువజన క్రీడల అధికారి నాగరాజు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వ యువజన సర్వీసుల శాఖ వారిచే ఏర్పాటు చేసిన వృత్తి శిక్షణ కేంద్రంలో ట్రైనింగ్ ఉంటుందని తెలిపారు. 6వ బ్యాచ్ తరగతులు ప్రారంభమైనట్లు తెలిపారు. కొన్నిసీట్లు మిగిలి ఉన్నందున ఈనెల 10 వరకు దరఖాస్తు చేసుకునే అవకాశం కల్పిస్తున్నట్లు తెలిపారు. ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాల ఆవరణలో గల శిక్షణ కేంద్రంలో దరఖాస్తులు సమర్పించాలన్నారు.

బూటకపు హామీలతో దగా



నార్సింగిలో మాట్లాడుతున్న ఎంపీ కొత్త ప్రభాకర్‌రెడ్డి

కాంగ్రెస్‌పై ఎంపీ ధ్వజం

రామాయంపేట(మెదక్): బూటకపు హామీలతో కాంగ్రెస్ నాయకులు ప్రజలను మోసగిస్తున్నారని, పనిచేసే నాయకులనే ఎన్నుకోవాలని మెదక్ ఎంపీ కొత్త ప్రభాకర్‌రెడ్డి పిలుపునిచ్చారు. బుధవారం నార్సింగి మండల కేంద్రంలో బతుకమ్మ చీరల పంపిణీ, స్పోర్ట్స్ కిట్లు పంపిణీ చేసి మాట్లాడారు. కార్యక్రమంలో ఎంపీపీ సబిత, జెడ్పీటీసీలు కృష్ణారెడ్డి, శ్రీనివాస్, వైస్ ఎంపీపీ సుజాత పాల్గొన్నారు

పార్టీ గెలుపునకు పనిచేయాలి

చేగుంట(తూప్రాన్): బీఆర్‌ఎస్ గెలుపు కోసం ప్రతి ఒక్కరూ పని చేయాలని ఎంపీ కొత్త ప్రభాకర్‌రెడ్డి అన్నారు. స్థానిక ఓ ప్రైవేటు ఫంక్షన్‌హాల్‌లో ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వచ్చే ఎన్నికల్లో దుబ్బాక ఎమ్మెల్యే అభ్యర్థిగా తాను బరిలో ఉంటున్నానని, కార్యకర్తలు తన గెలుపు కోసం పని చేయాలని కోరారు. ఇతర పార్టీ నాయకుల ప్రలోభాలకు లొంగవద్దని సూచించారు. బీఆర్‌ఎస్ పథకాలను ప్రజలకు వివరించాలన్నారు. అనంతరం ఎంపీడీఓ కార్యాయంలో 42 మంది లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి చెక్కులు, 13 మందికి జీఓ 58 అర్హత పత్రాలు, 11 మందికి జీఓ 59 అర్హత పత్రాలు ఎంపీ అందజేశారు. కార్యక్రమంలో రాష్ట్ర నాయకులు మనోహర్‌రావ్, వెంకటనర్సింహారెడ్డి, సర్పంచ్‌ల ఫోరం మండల అధ్యక్షుడు మంచికట్ల శ్రీనివాస్, ఎంపీపీ మాసుల శ్రీనివాస్ చేగుంట, నార్సింగి జడ్పీటీసీలు ముదాం శ్రీనివాస్, కృష్ణారెడ్డి, ఎంపీటీసీ వెంకటలక్ష్మి, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ ప్రవీణ్‌కుమార్, జింక శ్రీనివాస్ పాల్గొన్నారు.

క్లుప్తంగా

రైల్వే స్టేషన్‌ ఘటనపై ఎమ్మెల్యే ఫిర్యాదు



ఫిర్యాదు పత్రాన్ని చూపుతున్న ఎమ్మెల్యే రఘునందన్‌రావు

సిద్దిపేటకమాన్‌: సిద్దిపేట రైల్వే స్టేషన్‌ ప్రారంభోత్సవం వద్ద జరిగిన ఘటనపై అడిషనల్‌ డీసీపీకి ఫిర్యాదు చేసినట్లు దుబ్బాక ఎమ్మెల్యే రఘునందన్‌రావు తెలిపారు. బుధవారం ఆయన మాట్లాడుతూ.. ప్రధాని మోదీ ఇక్కడి ప్రజల దశాబ్దాల కలను నిజం చేశారన్నారు. రైల్వే స్టేషన్‌ ప్రారంభోత్సవంలో రైల్వే అధికారులపై మంత్రి ప్రవర్తించిన తీరు సరికాదన్నారు. ఘటన జరిగి 24 గంటలైనా పోలీసులు కేసు నమోదు చేయకపోవడం దురదృష్టకరమన్నారు. జరిగిన ఘటనపై నిష్పక్షపాతంగా విచారణ జరిపి నిందితులపై ప్రభుత్వ ఆస్తుల ధ్వంసం తదితర సెక్షన్‌ల కింద కేసులు నమోదు చేయాలన్నారు. కేంద్ర ప్రభుత్వం నిష్పక్షపాతంగా వ్యవహరించడం మూలంగానే సిద్దిపేట రైలు కల నేరవేరిందన్నారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు శ్రీరాంచక్రవర్తి, శ్రీకాంత్‌ రెడ్డి, ఉపెందర్‌రావు పాల్గొన్నారు.

మల్లన్న ఆలయానికి లాకర్‌ అందజేత

కొమురవెల్లి(సిద్దిపేట): మల్లికార్జున స్వామి ఆలయానికి హైదరబాద్‌కు చెందిన మాజీ ధర్మకర్త ఎర్రగొల్ల మల్లేశ్‌ బుధవారం లాకర్‌ను బహూకరించారు. కార్యక్రమంలో ఆలయ ప్రధానార్చకుడు మహదేవుని మల్లికార్జున్‌, పర్యవేక్షకుడు నీల శేఖర్‌ పాల్గొన్నారు. అలాగే ఆలయంలోని హుండీలను 12న లెక్కించనున్నట్లు ఆలయ ఈవో ఒక ప్రకటనలో తెలిపారు. లెక్కింపుకు హాజరైయ్యే ఉద్యోగులు సకాలంలో హాజరుకావాలని సూచించారు.

‘రుణపడి ఉంటాం’

కొమురవెల్లి(సిద్దిపేట): తెలంగాణ ప్రభుత్వానికి రుణపడి ఉంటామని తెలంగాణ రేషన్‌ డీలర్ల కన్వీనర్‌, సిద్దిపేట జిల్లా రేషన్‌ డీలర్ల సంఘం అధ్యక్షుడు దొమ్మాటి రవీందర్‌ అన్నారు. మండలంలోని గురువన్నపేట ఎల్లమ్మ ఆలయ ప్రాంగణంలో జిల్లా రేషన్‌ డీలర్ల సంఘం ప్రధానకార్యదర్శి చంద్రం అధ్యక్షతన బుధవారం జరిగిన సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ తమను గుర్తించి కమీషన్‌ రూ.90 నుంచి రూ.140కి పెంచడం శుభ పరిణామం అన్నారు. సీఎం కేసీఆర్‌, మంత్రి హరీశ్‌రావుకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో వూడెం కృష్ణారెడ్డి, మేకల యాదగిరి, ఆయా మండలాల రేషన్‌డీలర్లు పాల్గొన్నారు.

ఎన్నికల మేనిఫెస్టో కమిటీ సభ్యుడిగా శశిధర్‌రెడ్డి

హవేళిఘనాపూర్‌(మెదక్‌): కాంగ్రెస్‌ రాష్ట్ర ఎన్నికల కమిటీ మేనిఫెస్టో సభ్యుడిగా మెదక్‌ మాజీ ఎమ్మెల్యే శశిధర్‌రెడ్డిని నియమిస్తూ చైర్మన్‌ శ్రీధర్‌బాబు నియామకపత్రాన్ని అందజేశారు. బుధవారం హైదరాబాద్‌ గాంధీభవన్‌లో జరిగిన ఎన్నికల కమిటీలో తనకు స్థానం కల్పించినందుకు అధిష్టానానికి కృతజ్ఞతలు తెలిపారు.

కానిస్టేబుల్‌కు ఎంపిక

నిజాంపేట(మెదక్‌): మండలంలోని చల్మెడ గ్రామానికి చెందిన ముగ్గురు యువకులు బుధవారం విడుదల చేసిన కానిస్టేబుల్‌ ఫలితాల్లో ఎంపికయ్యారు. చల్మెడ గ్రామానికి చెందిన దోంతరబోయిన కర్ణాకర్‌ (సివిల్‌)కు, బ్యాగారి ప్రవీణ్‌ (టీఎస్‌ఎస్‌పీ కానిస్టేబుల్‌)కు, బురాని లక్ష్మణ్‌ గౌడ్‌ (టీఎస్‌ఎస్‌పీ కానిస్టేబుల్‌)కు ఎంపికయ్యారు. దీంతో గ్రామ సర్పంచ్‌ చెప్పెట నర్సింహరెడ్డి వారిని అభినందించారు.

తండాల అభివృద్ధికి పెద్దపీట

- గిరిజనాభివృద్ధి, స్త్రీ, శిశుసంక్షేమశాఖ మంత్రి సత్యవతి రాథోడ్‌
- 1,008 గురుకులాలు 7 లక్షల మంది విద్యార్థులు



అక్కన్నపేటలో గిరిజన ఆత్మీయ సమ్మేళనంలో మాట్లాడుతున్న మంత్రి సత్యవతి రాథోడ్‌

అక్కన్నపేట(హుస్నాబాద్‌): గిరిజన తండాల అభివృద్ధి సీఎం కేసీఆర్‌తోనే సాధ్యమయ్యాయని గిరిజనాభివృద్ధి, స్త్రీ, శిశు సంక్షేమశాఖ మంత్రి సత్యవతి రాథోడ్‌ అన్నారు. అక్కన్నపేటలో బుధవారం బంజారా ఆత్మీయ సమ్మేళనం సమావేశానికి ఆమె ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఆమె మాట్లాడుతూ గ్రామాలకు దూరంగా ఉన్న తండాలను పంచాయతీలుగా ఏర్పాటు చేసిన చరిత్ర సీఎం కేసీఆర్‌కే దక్కిందని, ఆయన వెంటే గిరిజనులంతా నడవాలన్నారు.

అదనపు గదులకు భూమి పూజ

హుస్నాబాద్‌రూరల్‌: దళిత, గిరిజన విద్యకు సీఎం కేసీఆర్‌ అధిక ప్రాధాన్యం ఇస్తున్నారని, ప్రతి ఏటా విద్యపై సగటున రూ.9 వేల కోట్లు ఖర్చు పెడుతున్నామని మంత్రి సత్యావతిరాథోడ్‌ అన్నారు. బుధవారం జిల్లెలగడ్డలోని గిరిజన బాలుర గురుకులం, కళాశాలలో రూ.5 కోట్ల వ్యయంతో నిర్మించే అదనపు తరగతి గదుల నిర్మాణ పనులకు భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కేసీఆర్‌ తెలంగాణలో 1,008 గురుకులాలను ఏర్పాటు చేశారని, తద్వారా సుమారు 7 లక్షల మంది విద్యార్థులు చదువుతున్నారని చెప్పారు. కార్పొరేటు విద్యా సంస్థలకు ధీటుగా విద్యా బోధన జరుగుతోందని, గురుకులాల్లో కూడా ఐఐటీ, నీట్‌ కోచింగ్‌లు ఇవ్వడం వల్ల విద్యార్థులు ఇంజనీర్లు, డాక్టర్లు అవుతున్నారని చెప్పారు. గిరిజనులు అందరూ తమ పిల్లలను గురుకులంలోనే చదివించాలని సూచించారు. అక్కన్నపేట గిరిజన బాలికల గురుకులం కోసం రూ.12 కోట్లు నిధులు మంజూరు చేస్తానని హామీ ఇచ్చారు. విద్యార్థులకు పౌష్టికాహారం అందించడానికి భోజన ఫీజులను 25 శాతం పెంచామన్నారు. విదేశీ విద్య కోసం కూడా ప్రభుత్వం రూ.20 లక్షలు ఆర్థిక సహాయం అందిస్తుందని ఆమె తెలిపారు. అనంతరం ఎమ్మెల్యే సతీష్‌కుమార్‌ మాట్లాడుతూ విద్య వల్లనే ప్రయోజకుల వుతారనే ఆలోచనతోనే సీఎం గురుకులాలను ఏర్పాటు చేస్తున్నారని చెప్పారు. ఆయా కార్యక్రమాల్లో హన్మకొండ జిల్లా జెడ్పీ చైర్మన్‌ సుధీర్‌బాబు, సిద్దిపేట జిల్లా జెడ్పీ వైస్‌ చైర్మన్‌ రాయిరెడ్డి రాజిరెడ్డి, ఎంపీపీ మాలోతు లక్ష్మీ, జెడ్పీటీసీ సభ్యులు భూక్య మంగ, వ్యవసాయ మార్కెట్‌ చైర్మన్‌ రజని, మున్సిపల్‌ చైర్‌పర్సన్‌ ఆకుల రజిత వెంకన్న పాల్గొన్నారు.

వాల్‌ పోస్టర్‌ విడుదల



మెదక్‌ కలెక్టరేట్‌: వర్గీకరణపై ప్రభుత్వంతో తాడో పేడో తేల్చుకునేందుకు ఉద్యమకారులు యుద్ధానికి సిద్ధం కావాలని ఎమ్మార్పీఎస్‌ జిల్లా ఇన్‌చార్జి లింగంపల్లి శ్రీనివాస్‌ మాదిగ పిలుపునిచ్చారు. ఈనెల 7న ఎమ్మార్పీఎస్‌ వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ ఆధ్వర్యంలో చేపట్టనున్న మాదిగల విశ్వరూపం మహాపాదయాత్రకు సంబంధించిన వాల్‌పోస్టర్‌ను బుధవారం మెదక్‌లో విడుదల చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ వచ్చే శీతాకాల పార్లమెంట్‌ సమావేశాల్లో వర్గీకరణ బిల్లు ప్రవేశపెట్టాలని డిమాండ్‌ చేస్తూ అలంపూర్‌ నుంచి హైదరాబాద్‌ వరకు నిర్వహించనున్న పాదయాత్రను జయప్రదం చేయాలని పిలుపు ఇచ్చారు. కార్యక్రమంలో నాయకులు మాసాయిపేట యాదగిరి, అస్తగల్ల బాల్‌రాజ్‌, చెట్ల యాదగిరి, సుధాకర్‌, సంజీవ్‌, కృష్ణ, కుమార్‌, సంపత్‌కుమార్‌ పాల్గొన్నారు.

ఐవోసీకి తరలని కార్యాలయాలు

- ఆసక్తి చూపని అధికారులు
- నిరుపయోగంగా గదులు
- ప్రజలకు తప్పని ఇక్కట్లు



ఐవోసీ భవనం

హుస్నాబాద్‌రూరల్‌: హుస్నాబాద్‌ ఇంటిగ్రేటెడ్‌ ఆఫీసు కాంప్లెక్స్‌ను సెప్టెంబరు 16న ఆర్థికశాఖ మంత్రి తన్నీరు హరీశ్‌రావు ప్రారంభించారు. ఈ సముదాయంలో ఆర్డీవో, తహసీల్దార్‌, ఈఈ కాళేశ్వరం, ఎస్టీవో, ఆటవీశాఖ, డీఎల్పీవో, డీఈ పంచాయతీరాజ్‌, ఆర్‌ అండ్‌ బీ నేషనల్‌ హైవే, ఆర్‌ అండ్‌ బీ రెగ్యులర్‌తో పాటు డివిజనల్‌ వ్యవసాయశాఖ కార్యాలయాలకు గదులు కేటాయించారు. అయితే ఐవోసీని ప్రారంభించి సుమారు ఇరవై రోజులు కావస్తున్నా అన్ని కార్యాలయాలు అక్కడికి తరలించలేదు. కేవలం ఆర్డీవో, తహసీల్దార్‌ కార్యాలయాలు మాత్రమే అక్కడ ప్రజలకు సేవలందిస్తున్నాయి. ఇతర కార్యాలయాలు ఐవోసీలో చేర్చేందుకు అధికారులు వెనుకాడుతున్నారు. విద్యుత్‌ సమస్య, ఇంటర్‌నెట్‌ సిగ్నల్‌ లేకపోవడం వంటి సమస్యల వల్ల అధికారులు ఆసక్తి చూపించడం లేదని సమాచారం. ప్రజలకు ఒకే దగ్గర ప్రభుత్వ సేవలు అందించాలని సీఎం కేసీఆర్‌ రూ.21 కోట్ల వ్యయంతో భవనం నిర్మిస్తే అధికారులు కార్యాలయాలను తరలించడంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని పలువురు ప్రజా ప్రతినిధులు ఆరోపిస్తున్నారు. రెవెన్యూ పనుల కోసం ఇతర కార్యాలయాలకు వెళ్లాలంటే రెండు కిలోమీటర్లు దూరంలోని హుస్నాబాద్‌కు రావాల్సి వస్తోందని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. జిల్లా అధికారులు స్పందించి కార్యాలయాలను ఐవోసీకి తరలించడానికి చర్యలు తీసుకోవాలని ప్రజా ప్రతినిధులు కోరుతున్నారు.

తిరుపతిరెడ్డికి మద్దతుగా రాజీనామాలు



రాజీనామా ప్రకటించిన నాయకులు

చిన్నశంకరంపేట(మెదక్‌): డీసీసీ అధ్యక్షుడు కంఠారెడ్డి తిరుపతిరెడ్డికి మద్దతుగా మండలంలోని పలు గ్రామాల గ్రామ అధ్యక్షులు, మండల కమిటీ అనుబంధ సంఘాల అధ్యక్షులు తమ రాజీనామాలను ప్రకటించారు. బుధవారం మండల కేంద్రంలో కాంగ్రెస్‌ కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్‌ మండల అధ్యక్షుడు పోతరాజ్‌ రమణ, ఎంపీటీసీ జయమ్మ, మాజీ ఎంపీటీసీ పోచయ్య, యూత్‌ కాంగ్రెస్‌ అధ్యక్షుడు ఉదయ్‌కుమార్‌, బీసీసెల్‌ మండలాధ్యక్షుడు రమేశ్‌, మండలంలోని పలు గ్రామాల గ్రామ అధ్యక్షుడు, మండల కమిటీ అనుబంధ సంఘాల అధ్యక్షులు ముకుమ్మడిగా తమ రాజీనామాలను ప్రకటించారు. అనంతరం వారు మాట్లాడుతూ.. మెదక్‌ నియోజకవర్గంలో కాంగ్రెస్‌ను బలోపేతం చేసిన తిరుపతి రెడ్డికి న్యాయం జరిగేలా అధిష్టానం చర్యలు చేపట్టాలని కోరారు. కొన్ని పర్యాయాలుగా కాంగ్రెస్‌లో కష్టపడ్డ నాయకులకు అన్యాయం చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్‌ నాయకులు రాములు యాదవ్‌, సుధాకర్‌రెడ్డి, రమేశ్‌, స్వామి, సిద్ధిరాములు, నాగరాజు ఉన్నారు.

పల్లె ప్రగతికి పట్టం : వంటేరు



పంచాయతీ భవనాన్ని ప్రారంభిస్తున్న ప్రతాప్‌రెడ్డి

జగదేవ్‌పూర్‌(గజ్వేల్‌): అభివృద్ధి మా హక్కు... ఓట్లు వేసే హక్కు మీదేనని, పల్లెల అభివృద్ధికి పట్టం కట్టిన సీఎం కేసీఆర్‌ను మరోసారి ఆశీర్వదించాలని ఎమ్మెల్సీ యాదవరెడ్డి, రాష్ట్ర అటవీ అభివృద్ధి సంస్థ చైర్మన్‌ ప్రతాప్‌రెడ్డి అన్నారు. మండలంలోని పలు గ్రామాల్లో రూ. 4.27 కోట్లతో నిర్మించిన పలు అభివృద్ధి పనులు, పంచాయతీ భవనాలు, మహిళా భవనాలు, అంగనగ్‌వాడీ కేంద్రాలను వారు బుధవారం ప్రారంభించారు. అలాగే రూ.కోటి 20 లక్షలతో పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ యువతకు ఉపాధి కోసం మునిగడప గ్రామంలో 400 ఎకరాల్లో పరిశ్రమల ఏర్పాటుకు భూసేకరణ ప్రారంభమైందన్నారు. పరిశ్రమలు ఏర్పాటు చేస్తే ఇక్కడి యువతకు ఉపాధి ఉంటుందన్నారు. బీఆర్‌ఎస్‌ ప్రభుత్వంలో పల్లెలు అన్ని రకాలుగా అభివృద్ధి చెందాయని పేర్కొన్నారు. నేటి నుంచి గృహలక్ష్మి పథకం ప్రారంభం అవుతుందని, అర్హులందరికీ పథకం అందిస్తామని తెలిపారు. బస్వాపూర్‌ గ్రామంలో తెలంగాణ వీరవనిత చాకలి ఐలమ్మ విగ్రహాన్ని ప్రతాప్‌రెడ్డి ఆవిష్కరించారు. కార్యక్రమంలో డీసీసీబీ చైర్మన్‌ దేవేందర్‌రెడ్డి, ఏఎంసీ చైర్మన్‌ శ్రీనివాస్‌, ఎంపీపీ బాలేషంగౌడ్‌, జెడ్పీటీసీ సుధాకర్‌రెడ్డి, ఎంపీపీ ఉపాధ్యక్షుడు భగవాన్‌, పీఏసీఎస్‌ చైర్మన్‌ ఇంద్రసేనారెడ్డి, ఆత్మకమిటీ చైర్మన్‌ రంగారెడ్డి, రైతుబంధు మండల కోఆర్డినేటర్‌ సుధాకర్‌రెడ్డి, సర్పంచ్‌ల ఫోరం మండలాధ్యక్షుడు నరేష్‌, ఎంపీటీసీల ఫోరం జిల్లా అధ్యక్షుడు కిరణ్‌గౌడ్‌ తదితరులు పాల్గొన్నారు.

హుందాగా రాజకీయాలు

బీజేపీ జిల్లా అధ్యక్షుడు శ్రీకాంత్‌ రెడ్డి



మంత్రి హరీశ్‌రావు దిష్టిబొమ్మను దహనం చేసేందుకు వెళుతున్న బీజేపీ నాయకులు

ప్రశాంత్‌నగర్‌(సిద్దిపేట): ప్రజాక్షేత్రంలో ఉన్నపుడు హుందాగా రాజకీయాలు చేయాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు దూది శ్రీకాంత్‌రెడ్డి అన్నారు. నూతన రైల్వేలైన్‌ను ప్రారంభించే సమయంలో జరిగిన ఘటనను నిరసిస్తూ బీజేఆర్‌ చౌరస్తాలో మంత్రి హరీశ్‌రావు దిష్టిబొమ్మ దహనం చేయడానికి గురువారం బీజేపీ నాయకులు ప్రయత్నించారు. వారిని పోలీసులు అడ్డుకున్నారు. శ్రీకాంత్‌ రెడ్డి మాట్లాడుతూ సిద్దిపేట ప్రజల కలైన రైల్వే లైనును ప్రధాని మోదీ ప్రభుత్వం సాకారం చేస్తుంటే అభినందించాల్సింది పోయి అడ్డగోలుగా ప్రవర్తించడం సిగ్గుచేటని ఆగ్రహం వ్యక్తం చేశారు. మంత్రిగా ఉంటూ కార్యకర్తలను రెచ్చగొట్టడం, అధికారులపై దురుసుగా ప్రవర్తించడం సరికాదన్నారు. ఘర్షణకు కారణమైన మంత్రి హరీశ్‌రావు, మెదక్‌ ఎంపీ ప్రభాకర్‌రెడ్డితో పాటు బీఆర్‌ఎస్‌ నాయకులపై పోలీసులు కేసు నమోదు చేయాలని డిమాండ్‌ చేశారు. ఉపేందర్‌ రావు, ఉడుత మల్లేశం, కొత్తపల్లి వేణుగోపాల్‌, బూరుగు సురేష్‌ గౌడ్‌, కోడూరి నరేష్‌, రోశయ్య, తొడుపునూరి వెంకటేశం పాల్గొన్నారు.

చాక్లెట్‌లో పురుగులు

- బేకరీలో మున్సిపల్‌ అధికారుల తనిఖీ
- పరిశీలించి కొనుగోలు చేయాలి



విచారిస్తున్న మున్సిపల్‌ అధికారులు

చేర్యాల(సిద్దిపేట): స్థానికంగా ఉన్న ఒక బేకరీలో కొనుగోలు చేసిన చాక్లెట్‌లో పురుగులు వచ్చాయని ఒక వినియోగదారుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు బుధవారం మున్సిపల్‌ అధికారులు తనిఖీ నిర్వహించారు. బేకరీలో ఎలాంటి పాడైన చాక్లెట్లు, తినుబండారాలు కనిపించలేదని అధికారులు తెలిపారు. వినియోగదారులు పరిశీలించి కొనుగోలు చేయాలని సూచించారు.

భూ పరిహారం ఏది?

కొండపాక(గజ్వేల్‌): తపాస్‌పల్లి రిజర్వాయర్‌ కోసం భూములు కోల్పోయిన వారికి పరిహారం అందేలా చూడాలని కోరుతూ సీపీఐ ఆధ్వర్యంలో ముంపు బాధితులు బుధవారం ఆర్డీవో కార్యాలయం ఎదుట ఆందోళన చేశారు. అనంతరం కార్యాలయంలో వినతి పత్రాన్ని సమర్పించారు. కుకునూరుపల్లి మండలంలోని శివారు ప్రాంతాల్లో భూములు కోల్పోయారని, పూర్తి పరిహారం అందించలేదని సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి శివలింగు కృష్ణ వాపోయారు. పరిహారం అందజేయకపోతే ఉద్యమం ఉధృతం చేస్తామని హెచ్చరించారు.

ముగిసిన బాలికల క్రీడా పోటీలు

- అండర్‌ 19 పోటీలలో ప్రతిభ
- ఓవరాల్‌ చాంపియన్‌ వర్గల్‌



ఓవరాల్‌ చాంపియన్‌ షిప్‌ సాధించిన వర్గల్‌ బాలికలు

వర్గల్‌(గజ్వేల్‌): వర్గల్‌ జ్యోతిబా పూలే గురుకులం వేదికగా రెండు రోజుల పాటు కొనసాగిన ఉమ్మడి జిల్లా స్థాయి అండర్‌-19 బాలికల ఆటల పోటీలు బుధవారంతో ముగిశాయి. ఆటల పోటీలలో వర్గల్‌ పూలే గురుకుల బాలికలు ఉత్తమ ప్రతిభ చూపి ఓవరాల్‌ చాంపియన్‌షిప్‌ సాధించారు. విద్యార్థిని శ్రావణి వ్యక్తిగత చాంపియన్‌షిప్‌ దక్కించుకుంది. విజేతలకు నవోదయ ప్రిన్సిపాల్‌ డి.రాజేందర్‌ బహుమతి ప్రదానం చేశారు. కార్యక్రమంలో ఆతిథ్య గురుకుల ప్రిన్సిపాల్‌ లక్ష్మీదేవి, వ్యాయామ ఉపాధ్యాయులు మౌనిక, చంద్రిక పాల్గొన్నారు. వాలీబాల్‌లో వర్గల్‌, ముత్తంగి గురుకుల బాలికలు, ఖోఖోలో వర్గల్‌, దుబ్బాక, కబడ్డీలో జోగిపేట, వర్గల్‌, టెన్నికాయిట్‌లో వర్గల్‌, ముత్తంగి బాలికలు వరుసగా ప్రథమ, ద్వితీయ స్థానంలో నిలిచారు.

వేర్వేరు సంఘటనల్లో నలుగురు మృతి



చెరువులో పడి మృతి చెందిన లక్ష్మి

పాపన్నపేట(మెదక్‌): చెరువులో పడి అనుమానస్పద స్థితిలో ఒక మహిళ మృతి చెందిన ఘటన మల్లంపేట గ్రామంలో చోటుచేసుకుంది. టేక్మాల్‌ మండలం ఎల్లుపేటకు చెందిన లక్ష్మి(30)కి మల్లంపేటకు చెందిన నాగరాజుతో గతంలో వివాహం జరిగింది. భార్యభర్తలు తరుచూ గొడవ పడుతుండేవారు. ఈ క్రమంలో మంగళవారం సాయంత్రం గొడవ జరిగి లక్ష్మి ఇంట్లోంచి వెళ్లిపోయింది. అయితే బుధవారం లక్ష్మి మృతదేహాన్ని స్థానికులు చెరువులో గమనించి పోలీసులకు సమాచారం అందించారు. ఎస్‌ఐ మహిపాల్‌రెడ్డి ఘటనా స్థలాన్ని పరిశీలించి లక్ష్మి తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేశారు.

ప్రమాదవ శాత్తు చెరువులో పడి..



చెరువులో మునిగి మృతి చెందిన తిరుపతి

సిద్దిపేటఅర్బన్‌: కాలకృత్యాల కోసం వెళ్లిన వ్యక్తి ప్రమాదవశాత్తు చెరువులో పడి చనిపోయిన ఘటన మండలంలోని ఎన్సాన్‌పల్లిలో జరిగింది. పోలీసుల కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన ఆకుల తిరుపతి (33) వ్యవసాయం చేసుకుంటూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. మంగళవారం రాత్రి 11 గంటల సమయంలో తిరుపతి కాలకృత్యాలు తీర్చుకోవడానికని వెళ్లి ఉదయం అయినా రాకపోవడంతో దగ్గరి బంధువులు గాలించగా చెరువులో మృతదేహాన్ని గమనించారు. భార్య స్రవంతి ఇచ్చిన ఫిర్యాదు మేరకు త్రీటౌన్‌ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

కరెంట్‌ షాక్‌తో వృద్ధురాలు..

కల్హేర్‌(నారాయణఖేడ్‌): కరెంట్‌ షాక్‌తో వృద్ధురాలు మరణించిన ఘటన సిర్గాపూర్‌ మండలం పోచాపూర్‌లో మంగళవారం రాత్రి జరిగింది. ఎస్‌ఐ మహిపాల్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం ఇంట్లో కరెంట్‌ తీగలు తెగి ఇనుప డోర్‌పై పడడంతో గ్రామనికి చెందిన ఎండీ. రహనాబీ(56) విద్యుత్‌ షాక్‌కు గురైంది. కుటుంబీకులు నారాయణఖేడ్‌ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ఆస్పత్రిలో చికిత్స పొందుతూ రహనాబీ మృతి చెందింది.

చికిత్సపొందుతూ జర్నలిస్టు మృతి



నాగయ్య(ఫైల్‌)

జహీరాబాద్‌: సీనియర్‌ జర్నలిస్టు నాగయ్య(45) రోడ్డు ప్రమాదానికి గురై చికిత్స పొందుతూ బుధవారం ఆస్పత్రిలో మరణించాడు. పోలీసులు, బంధువుల కథనం ప్రకారం.. ఝరాసంగం మండలంలోని ప్యాలవరం గ్రామానికి చెందిన నాగయ్య గత 22 రాత్రి స్వగ్రామానికి మోటారు బైక్‌పై వెళుతూ పస్తాపూర్‌ గ్రామ శివారులోని నారింజవాగు వంతెన వద్ద రోడ్డు ప్రమాదానికి గురై తీవ్రంగా గాయపడ్డాడు. అతడిని కుటుంబ సభ్యులు హైదరాబాద్‌లోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమించడంతో చికిత్స పొందుతూ బుధవారం తెల్లవారు జామున మరణించాడు.

గుర్తు తెలియని మృతదేహం లభ్యం

వట్‌పల్లి(అందోల్‌): అందోల్‌ మండల పరిధిలోని అన్నాసాగర్‌ చెరువు తూము వద్ద గుర్తు మృతదేహం లభ్యమైంది. జోగిపేట ఎస్‌ఐ గైపప్పా తెలిపిన వివరాల ప్రకారం.. ఉదయం గ్రామస్తులు చెరువులో గుర్తుతెలియని మృతదేహాన్ని గమనించి పోలీసులకు సమాచారం అందించారు. వయస్సు సుమారుగా 30 ఏళ్ల ఉంటుందని, కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

బైక్‌ ప్రమాదంలో భార్యాభర్తలకు గాయాలు



గాయపడిన రామాచారి, దీప్తి

నర్సాపూర్‌ రూరల్‌: బైక్‌ను బొలెరో వాహనం ఢీకొట్టడంతో భార్యాభర్తలు గాయపడిన ఘటన నర్సాపూర్‌ - మెదక్‌ రహదారిలో చిన్న చింతకుంట సమీపంలో చోటుచేసుకుంది. సంగారెడ్డి జిల్లా గుమ్మడిదల మండలం కానుకుంట గ్రామానికి చెందిన రామాచారి అతడి భార్య దీప్తి బుధవారం బైక్‌పై నర్సాపూర్‌ మీదుగా మెదక్‌ వైపు వెళ్తుండగా చింతకుంట వద్ద వారిని బొలెరో వాహనం ఢీకొట్టింది. గాయపడిన వారు ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు.

విద్యుత్‌ షాక్‌తో..

నర్సాపూర్‌ రూరల్‌: విద్యుత్‌ షాక్‌కు గురై ఇద్దరు గాయపడిన ఘటన స్థానిక బస్టాండ్‌ వద్ద బుధవారం చోటుచేసుకుంది. బస్టాండ్‌ వద్ద ఉన్న భవన యజమాని కపాచారి, ముగ్గురు పెయింటర్లతో పనులు చేస్తుండగా ప్రమాదవశాత్తు భవనాన్ని ఆనుకుని ఉన్న విద్యుత్తు లైన్‌ను తాకడంతో కొడిపల్లి మండలం రాజుపేటకు చెందిన పెయింటర్‌ మలోత్‌ సయ్యకు విద్యుత్‌ షాక్‌ తగిలింది. అతడిని కాపాడడానికి ప్రయత్నించిన కపాచారి కూడా షాక్‌కు గురయ్యాడు. ఇద్దరినీ గాంధీ ఆసుపత్రికి తరలించారు. ఇద్దరూ చికిత్స పొందుతున్నారు.



షాక్‌కు గురైన మాలోత్‌ సయ్య

మార్కెట్‌కి వెళ్లి.. మహిళ అదృశ్యం

పటాన్‌చెరు టౌన్‌: మార్కెట్‌కి వెళ్లిన ఒక మహిళ, మరో ఘటనలో వేరొక బాలిక అదృశ్యమయ్యారు. స్థానిక పోలీసుల కథనం ప్రకారం మధ్యప్రదేశ్‌కు నుంచి ఇస్నాపూర్‌కు వలస వచ్చిన శాంతిబాయి కూలీ పనిచేసుకునే జీవనం సాగిస్తోంది. ఈ నెల రెండో తేదీన మార్కెట్‌కని వెళ్లి ఆమె తిరిగి ఇంటికి రాలేదు. దీంతో శాంతిబాయి బంధువులు, స్థానికంగా వెతికినా ఆచూకీ లభించలేదు. శాంతిబాయి అదృశంపై బంధువు సందీప్‌ ఫిర్యాదు చేయగా పోలీసులు బుధవారం కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. అలాగే ఛత్తీస్‌గఢ్‌ నుంచి చిటుకుల్‌కు వలస వచ్చి కూలీపని చేసుకుంటూ జీవనం సాగిస్తున్న ఒక కుటుంబానికి చెందిన బాలిక మంగళవారం ఉదయం నుంచి కనిపించడంలేదని ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

మూత్ర విసర్జనకు వెళ్లి..

మూత్ర విసర్జనకు వెళ్లి వ్యక్తి అదృశ్యమైన సంఘటన అమీన్‌పూర్‌ పోలీస్‌ స్టేషన్‌ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం... రంగారెడ్డి జిల్లా శేరిలింగంపల్లి చెందిన డప్పు శ్రీనివాస్‌(52) కుటుంబ సభ్యులతో కలిసి బీరంగూడ గుట్టపై శివాలయంలో నిద్ర చేసేందుకు 2వ తేదీన వచ్చారు. ఈ క్రమంలో అర్ధరాత్రి ఒకటిన్నర సమయంలో మూత్ర విసర్జనకి వెళ్లిన శ్రీనివాస్‌ తిరిగి రాలేదు. దీంతో కుటుంబ సభ్యులు గాలించినా ఆచూకీ లభించలేదు. దీంతో శ్రీనివాస్‌ సోదరుడు యాదగిరి బుధవారం స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

కుటుంబ కలహాలతో..

సిద్దిపేటకమాన్‌: భార్య భర్తలు ఇద్దరు గొడవపడి భర్త ఇంటి నుంచి వెళ్లి తిరిగి రాకపోవడంతో బాధిత కుటుంబ సభ్యులు ఫిర్యాదు చేయగా సిద్దిపేట టూటౌన్‌ పోలీసులు బుధవారం కేసు నమోదు చేశారు. సీఐ రవికుమార్‌ తెలిపిన వివరాల ప్రకారం .. శివరాత్రి కనకరాజు, రాజేశ్వరి తమ ఇద్దరి పిల్లలతో కలిసి పాత కేసీఆర్‌ నగర్‌లో నివాసం ఉంటున్నారు. మూడు నెలల క్రితం కనకరాజు తన భార్యతో గొడవపడి ఇంటి నుంచి బయటకు వెళ్లాడు. ఇప్పటికీ కనకరాజు ఇంటికి తిరిగి రాకపోవడ, ఎలాంటి ఆచూకీ లభించకపోవడంతో కనకరాజు తల్లి కొమురమ్మ బుధవారం సిద్దిపేట టూటౌన్‌ పోలీసులకు ఫిర్యాదు చేసింది. దీంతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

హోంగార్డు ఆత్మహత్య



మల్లారెడ్డి (ఫైల్‌)

హుస్నాబాద్‌రూరల్‌: హుస్నాబాద్‌ పోలీసు స్టేషన్‌లో విధులు నిర్వహిస్తున్న పొట్లపల్లి గ్రామానికి చెందిన హోంగార్డు దేవసాని మల్లారెడ్డి (54) బుధవారం తెల్లవారు జామున ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. గ్రామస్తుల కథనం ప్రకారం మల్లారెడ్డి మంగళవారం విధులకు హాజరైన సాయంత్రం ఇంటికి వెళ్లాడు. అయితే తెల్లవారు జామున భార్య లత నిద్రలేచి బయటకు వచ్చేసరికి బాతురూమ్‌ పక్కనే మల్లారెడ్డి ఉరి వేసుకుని ఉండడం గమనించింది. పోలీసులకు సమాచారం అందించడంతో మృత దేహాన్ని సీఐ ప్రభుత్వ అస్పత్రికి తరలించారు.

ఉత్సాహంగా క్రీడలు

సిద్దిపేటరూరల్‌: జిల్లా స్థాయిలో ఎంపికైన జట్లకు బుధవారం ఎల్లంకి కళాశాల మైదానంలో ఉమ్మడి జిల్లా ఖోఖో టోర్నమెంటు క్రీడలు నిర్వహించారు. అందులో 12 జట్లు పోటీ పడ్డాయి. అండర్‌-14 బాలికల విభాగంలో సిద్దిపేట జిల్లా ప్రథమ, సంగారెడ్డి ద్వితీయ, మెదక్‌ తృతీయ, బాలుర విభాగంలో మెదక్‌ ప్రథమ స్థానం, సంగారెడ్డి ద్వితీయ స్థానం, సిద్దిపేట తృతీయ స్థానంలో నిలిచాయి. అండర్‌-17 బాలికల విభాగంలో సిద్దిపేట ప్రథమ స్థానం, సంగారెడ్డి ద్వితీయ స్థానం, మెదక్‌ తృతీయ స్థానంలో, అండర్‌ -17 బాలుర విభాగంలో సంగారెడ్డి ప్రథమ స్థానం, సిద్దిపేట ద్వితీయ స్థానం, మెదక్‌ తృతీయస్థానంలో నిలిచింది. పీఈటీలు వెంకటస్వామిగౌడ్‌, అశోక్‌లు క్రీడలను పర్యవేక్షించారు.